**117**
**ధారావాహిక**



# జాయ సేనాపతి

మత్తి భానుమూర్తి ...
99893 71284

### చారిత్రక కాల్పనిక నవల

**జరిగిన కథ :** కొలని యుద్ధరంగంలో మొదటిరోజే బీభత్సం సృష్టించింది రుద్రమ. తన యుద్ధవిద్యా ప్రావీణ్యాన్ని ప్రదర్శిస్తూ.. శత్రుమూకలను చెల్లాచెదురు చేసింది. శత్రుయుద్ధ ప్రముఖులు రుద్రమ దూకుడును జాగ్రత్తగా గమనించి.. పక్షంరోజుల తర్వాత ఆమెపై మూకదాడికి దిగారు. ఆమె కాళ్లకు గురిచూసి బాణాలు వేసి, కత్తులతో దాడిచేశారు. అప్పుడొక యువసేనాని అడ్డుకొని.. కాళ్లలో బాణాలు దిగి ఉన్న రుద్రమను రథంలోకి ఎక్కించుకొని యుద్ధభూమి నుంచి బయటపడ్డాడు. అయితే, ఆ యువసేనాని ఎవరో.. అక్కడున్న వారెవరూ గుర్తించలేక పోయారు.

రుద్రమ జాడ తెలియకపోవడంతో.. జీవితంలో ఎప్పుడూ లేనంత కలవరపాటుకు గురయ్యాడు జాయచోడుడు. చిన్నతల్లి! యుద్ధ నైపుణ్యాలు చెట్లనీడన నేర్చుకున్న లేత ఆడపిల్ల ప్రత్యక్ష యుద్ధక్షేత్రంలో ఖంగుతిన్నది. ఇది ఆయన ఊహించాడు. హెచ్చరించాడు. కానీ, జరగరానిది జరిగిపోయింది. ఇప్పుడెలా.. ఎక్కడని వెతకాలి?

ఒకరిద్దరు సైనికులు, వేగులవాళ్లు కొన్ని సాక్ష్యాలు చెప్పారు. ఆ యువసేనాని కాకతీయ సేనానే. రథం మన సైన్యం మధ్యనుండే ఆమెతో వెళ్లిపోయింది.

ఈవార్తను అనుమకొండకు పంపవద్దని వేగు నియోగాధిపతికి చెప్పి.. నలువైపులా వెతికిస్తున్నాడు జాయచోడుడు. ఆ సంధ్యవేళ ఓ వార్తాహరుడు జాయ సేనాపతికి ఓ లేఖ అందించాడు.

సారాంశం.. రుద్రమదేవి క్షేమంగా తమ రాజనగరిలో ఉన్నదని! ఆ వార్త పంపినవాడు నిడుదప్రోలు మహారాజు ఇందుశేఖరుడు!

'హమ్మయ్య!' అని నిట్టూర్చింది కాకతీయ స్కంధావారం. అయితే ఆమెను అక్కడికి చేర్చిన సేనాని ఎవ్వరు?

నిడుదప్రోలు రాజ్య ప్రాంతంలోనే ఈ స్కంధావారం ఉంది. ఆమె కాళ్లకు బాణాలు దిగబడటం చూసిన ఆ యువవీరుడు వెంటనే స్పందించి ఆమెకు స్కంధావారపు వైద్యసేవల కంటే మరింత మంచి వైద్యం అవసరమని గుర్తించి.. వెనువెంటనే తన రథాన్ని రాజనగరి వైపు మళ్లించాడు. రాజ వైద్యులతో సత్వర వైద్యం ఏర్పాటుచేసి రుద్రమ కాళ్లు తొలగించాల్సిన పరిస్థితిని తప్పించాడు.

అప్పటికప్పుడు వాయువేగ మనోవేగాలతో నిడుదప్రోలు రాజనగరికి వెళ్లి రుద్రమను చూశాక స్థిమితపడ్డాడు జాయసేనాపతి. అక్కడ తెలిసింది.. రుద్రమను కాపాడి రాజనగరికి తెచ్చినవాడు నిడుదప్రోలు యువరాజు, ఇందుశేఖరుని కుమారుడు వీరభద్ర భూపతి!

రుద్రమను కాపాడినవాడు నిడుదప్రోలు యువరాజు.. ఇందుశేఖరుని కుమారుడు వీరభద్ర భూపతి!

ఆమె అంత బాధలోనూ జాయ మామను చూసి చిరునవ్వు నవ్వింది.

''కొంచెం తడబడ్డాను మామా..''

''మంచి అనుభవం చిన్నతల్లీ. ముందు కోలుకో..''

అతని హస్తాన్ని గట్టిగా పట్టుకుంది.

''నాకో మాటివ్వాలి మామా..''

ఆమె ఉద్వేగం గుర్తించి చిబుకం పట్టుకుని అన్నాడు..

''ముందు కోలుకో.. చిన్నతల్లీ..''

''నాపై ధనుస్సు ఎక్కుపెట్టిన వాళ్లను నువ్వు ఏమీ చెయ్యకూడదు. నేనే వాళ్లను ఖండఖండాలుగా నరకాలి..''

ఆమె కళ్లు విస్ఫులింగాలై ప్రజ్వరిల్లితున్నాయి. క్రోధాగ్నితో శరీరం వణుకుతోంది.

జాయసేనాపతి వచ్చాడన్న వార్త విని మహారాజు